# ★ కన్నీరు ★

★ శ్రీ గూడ వేంకటచలపతిరావు ★

'శాంతా'

'............'

'శాంతా'

'ఆ......మరి?'

'మరి...కారణమా? లేదు శాంతా ఊరికే...అదేమో కాని...శాంతా...అని నీ నామం తలుస్తుంటే యీ దగ్ధ హృదయానికి కొంచం శాంతిగా ఉంటుంది శాంతా... అందుకోసమే—'

'ప్రకాశం. మన యీ కలయికలకు స్వస్తి చెప్పాలని యెన్నోమార్లు మనవిచేశాను. కాని స్వార్థపరుడవై నీ వెప్పటి కప్పుడే మరచి నన్ను యీలా నిర్బంధించడం ధర్మంకాదు. ఇందులోనున్న కష్టసుఖాలు—'

'తెలుసు శాంతా తెలుసు...మరియేంచేశేది. ప్రేమమయమని భ్రమజెంది విషప్రవాహంలోబడి ఉక్కిరిబిక్కిరైన నాకు అదృష్టవశాత్తు శుద్ధప్రేమను రుచిచూపగల నీతావు దొరికింది శాంతా...మరి వదలుటెట్లు... అయినా చూడుశాంతా...నేటినుండి నీ ఆజ్ఞ శిరసావహించి యే విజనప్రదేశాల్లో నీ నామాన్ని యీజన్మకు తారకంలాగా ఉపయోగించుకొని, ఉపాసిద్దామని నిశ్చయించాను శాంతా. అందుకోసమే ఆరాధ్యదేవతవగు నీ అనుమతి ముందుగా పొందటానికే నేడు—'

'తప్పదు ప్రకాశం...యేంచేశేది. మన యీ కలయిక మన యీ ప్రేమ కారణంగా నేడు కొన్నికుటుంబాలు రూపు నామాలు లేకుండా నశించిపొయ్యేస్థితిలో నున్నాయను విషయం నీకూ తెలుసుగదా. ప్రపంచకోసమైనా మనం నేడు బాహ్యసంబంధాన్ని తెంచుకోవాలి ప్రకాశం...అదృష్టవశాత్తు కాలప్రవాహంలో ఒక్కతరి చేరి ప్రేమబద్ధులమైన మనం కాలవశాత్తు నేడు విడిపోవాలిసొచ్చింది...పైన నేటి మన యీ బాంధవ్యంలో మన యీ బాహ్యప్రేమకు తావులేదు ప్రకాశం...అయినా నేను నేడు నీబోటి యువకుడు ప్రేమింప తగినంత అందంగా...''

'వద్దు శాంతా ఆమాట లొద్దు...క్షణికమగు బాహ్య సౌందర్యమును క్షుద్రుడగు కాముకుడు ప్రేమించి తన విషయవాంఛకోసం వినియోగించుకొనును శాంతా... అది పశుతత్వం...నిర్మలమగు ప్రేమకాదు శాంతా అది ...విషయవాసన. బుద్బుదప్రాయమగురూపలావణ్యమయమైన నీ బాహ్యసౌందర్యమునుగాదు శాంతా నే వాంఛించునది...శాశ్వతమగు నీ ఆత్మసౌందర్యము...నీ హృదయాంతర్గతమైన నిర్మలప్రేమ...మన యీ నిర్మలప్రేమ ప్రవాహము కాలభేధముచే...వ్యక్తుల వ్యష్టిత్వంచే అడ్డబడునదికాదు శాంతా. యీ ప్రేమ ప్రవాహము నిత్య ఉద్రేకపూరితమై...హృదయాంతర్గతముగా...మన జీవితాంతములవరకు ప్రవహించవలసినదే...శాంతా... నే వాంఛించునది ఒక్క నీయనుజ్ఞ...నీ మూర్తిత్వమును... నీ నిర్మలప్రేమను ... నిరాడంబరముగా ... హృదయాంతర్గతముగా...ఉపాసించుకొని... అనుభవించుకొనుటకు ...నే కోరునది ఒక్క నీయనుజ్ఞ...శాంతా'—.

'నే చేయునది ఆజ్ఞా?—ప్రకాశం. కాదు...ప్రార్థన కాలానికి కట్టుబడి మన యీ బాహ్య ప్రేమబంధనం నేడు యీ వేడికన్నీటితో కరగి పోవాలిసొచ్చింది. కాని ఇంతమాత్రముచే - వ్యక్తిగతమగు యీ బాహ్య వియోగముచే - అన్యోన్యాశ్రయమైన మన హృదయాంతర్గత నిర్మలప్రేమ...ప్రేమమూర్తులు నశించనేరవు ప్రకాశం ...కాని ఇక మన యీ ప్రేమనాటకమునకు నేటి మన యీకలయిక తుది అంకంగా భావించుకోవాలి. ప్రకాశం'—.

'ఆ...శాంతా...ఒక్కవిషయం. మానవుడు మొట్టమొదట స్వరూపమును నిర్ణయించుకొని తరుపరి తన ఇష్టదేవత నుపాసించుకొనునట్లు నావద్ద నా ఆరాధ్యదేవతాస్మృతిచిహ్నముండినచో కాని.—'

'ఇంద ప్రకాశం...ఇది నేను స్వయంగా అల్లిన చేరుమాలు......నీవు ముద్దుగా పిలుచుకుంటే నా ఉపనామంకూడా ఇందు అల్లివుంది...దీన్ని నాస్మృతిచిహ్నంగా...ప్రేమోపహారంగా ... స్వీకరించి, నాజీవితాంతమువరకు నీ వద్దనుంచుకో. కాని...ప్రకాశం యీ రహస్యంమటుకు.—'

'తెలుసు శాంతా. దాచేసుకుంటాను. యీ రహస్యం మన యిరువురి హృదయకోణాల్లో నే అణగిపోయింది... కాని ఇదేమి! శాంతా...రుమాలు తడిసింది,.. కారణం?',

'............'

'చెప్పవు శాంతా?......తుదికోరిక'

'కారణమా? ప్రకాశం క-న్నీ-రు.'